క్లుప్తంగా

బెల్ట్‌షాప్‌పై పోలీసుల దాడి



సీజ్ చేసిన మద్యం బాటిళ్లతో ఎస్సై కిరణ్‌కుమార్, పోలీసు సిబ్బంది

మల్లాపూర్: మండలంలోని వెంకట్రావ్‌పేటలో ఓ బెల్ట్‌షాప్‌పై గురువారం రాత్రి ఎస్సై కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు దాడులు చేశారు. రూ.19,045 విలువైన 32.135 లీటర్ల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని నిర్వాహకుడిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎస్బీ కానిస్టేబుల్ రషీద్, హెడ్ కానిస్టేబుల్ కోటేశ్వర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడులు

మెట్‌పల్లిరూరల్: ఏఎస్‌ఆర్‌తండాలో పేకాట స్థావరంపై దాడులు నిర్వహించినట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు. ఐదుగురు వ్యక్తులు పట్టుబడ్డగా, మరో ఎనిమిది మందితోపాటు పేకాట ఆడిస్తున్న గుగులోతు గంగాదాస్ పారిపోయారన్నారు. ఐదుగురి వద్ద రూ.8వేల నగదు, 5 సెల్‌ఫోన్లు, 9 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నామన్నారు.

నేడు ఇసుక డంపులకు వేలం

మల్లాపూర్: గొర్రెపల్లి శివారులో సీజ్ చేసిన ఇసుక డంపులను శుక్రవారం వేలం వేస్తున్నట్లు తహసీల్దార్ వీర్‌సింగ్ తెలిపారు. ఇసుకను అక్రమంగా నిల్వ ఉంచి రవాణా చేస్తున్నారన్న సమాచారం మేరకు గత నెల 29న గొర్రెపల్లి శివారులో నిల్వ ఉంచిన ఇసుక డంపును రెవెన్యూ అధికారులతో దాడులు నిర్వహించి పట్టుకున్నామన్నారు. సుమారు 10 ట్రిప్పుల ఇసుకను శుక్రవారం ఉదయం 11 గంటలకు బహిరంగ వేలానికి ప్రకటన జారీ చేశామని తెలిపారు. రూ.5వేలు డిపాజిట్ జమ చేసి రశీదు పొంది పాల్గొనాలని సూచించారు.

జాతీయస్థాయి పోటీలకు మౌంట్ కార్మెల్ విద్యార్థి



విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ బృందం

జగిత్యాలరూరల్: జాతీయస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు జగిత్యాల అర్బన్ మండలం ధరూర్‌లోని మౌంట్ కార్మెల్ పాఠశాలకు చెందిన విద్యార్థి మణికంఠ ఎంపికయ్యాడు. ఏప్రిల్ 27 నుంచి 30 వరకు హర్యానా రాష్ట్రంలో జరిగే జాతీయస్థాయి ఎస్జీఎఫ్‌ఐ అండర్–17 బాస్కెట్ బాల్ పోటీల్లో కొక్కు మణికంఠ తెలంగాణ రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నాడు. పాఠశాల ప్రిన్సిపాల్ సిస్టర్ జ్యోతిస్, ఫాదర్ జోసెఫ్‌రెడ్డి, సిస్టర్స్ జోస్మి, సీమ, సోఫీ, శృతి, పీఈటీలు మంగ, పులి విజ్ఞాన్, కందుకూరి సామంత్, హరీష్, ఉపాధ్యాయులు అభినందించారు.

జీవన్‌రెడ్డితోనే జగిత్యాల అభివృద్ధి

జగిత్యాల: జగిత్యాలలో సామాన్యుడికి విద్య, వైద్యం అందుతుందంటే జీవన్‌రెడ్డితోనే సాధ్యమైందని మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి అన్నారు. జిల్లాకేంద్రంలోని పలు కాలనీల్లో ప్రచారం చేశారు. పేదలకు విద్య, వైద్యం అందాలనే ఉద్దేశంతో జగిత్యాలలో జేఎన్‌టీయూ కళాశాల, మహిళా డిగ్రీ కళాశాల, పాత బస్టాండ్‌లో ఆస్పత్రి, రవాణా సౌకర్యార్థం బైపాస్ రోడ్ ఇలా ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టారన్నారు. గతంలో యావర్ రోడ్‌ను రూ.60 ఫీట్లకు పెంచిన ఘనత జీవన్‌రెడ్డిదేనని అన్నారు. ఎంపీగా గెలిపించి మరోసారి జగిత్యాలను అభివృద్ధి చేసుకుందామన్నారు. నాయకులున్నారు.

కొనసాగుతున్న అగ్నిమాపక వారోత్సవాలు



ధర్మపురిలో అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

ధర్మపురి: పట్టణంలో అగ్నిమాపక వారోత్సవాలు గురువారం నాలుగో రోజుకు చేరాయి. ధర్మపురిలోని ఎల్పీజీ గ్యాస్ గోదాం, పెట్రోల్ బంకులను పరిశీలించారు. వాటిలో అగ్ని ప్రమాదాలు జరిగినపుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు.. నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. మంటల్ని ఎలా ఆర్పాలో చూపించారు. ఎల్ఎఫ్ లక్ష్మీనారాయణ, ప్రవీణ్‌రావ్, సిబ్బంది రఫిక్, రాజేంద్రప్రసాద్, కృపాకర్ తదితరులున్నారు.

మంచినీళ్లకు గోస గోస..

- అలంకారప్రాయంగా నీటి ట్యాంకు
- రాజారాంతండాలో కానరాని 'మిషన్ భగీరథ'



వృథాగా నీటి ట్యాంకు

కథలాపూర్: మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికి మంచినీరు ఇస్తున్నామని పాలకులు, ప్రజాప్రతినిధులంటున్నా.. రాజారాంతండాలో మాత్రం నీటికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామానికి ఇప్పటివరకు మిషన్ భగీరథ నీళ్లు రాకపోవడం బాధాకరమని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలోని ప్రజలకు నీళ్లందించేందుకు 8 బోరు బావులుండగా.. వేసవి కాలం ఆరంభంలోనే రెండు బోరు బావుల్లో నీళ్ల అడుగంటి చుక్క నీరు రాక నీటి సమస్య నెలకొందని స్థానికులు వాపోతున్నారు. ఎండాకాలంలో నీటి కష్టాల నుంచి గట్టెక్కించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

బోరు బావులే దిక్కు..

రాజారాంతండాలో 380 జనాభా ఉంది. వారికి నీళ్లందించాలని మూడేళ్ల క్రితం 20వేల లీటర్ల సామర్థ్యం గల నీటి ట్యాంకు నిర్మించారు. ఆ ట్యాంకులోకి మిషన్ భగీరథ పథకం నీరు రావడం లేదని గ్రామస్తులంటున్నారు. ట్యాంకు అలంకారప్రాయంగా మారిందని, బోరు బావుల నీళ్లే దిక్కవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆయా వాడల్లో 8 బోరు బావుల ద్వారా నీళ్ల అందిస్తుండగా.. రెండు బోరు బావుల్లో నీళ్ల అడుగంటి చుక్క నీరు రావడం లేదని వాపోతున్నారు. మిగతావాటిలో కొద్దికొద్దిగా నీళ్ల వస్తున్నాయన్నారు. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు దృష్టి సారించి వేసవిలో నీటికి ఇబ్బందుల్లేకుండా చూడాలని కోరుతున్నారు. ఈ విషయమై మిషన్ భగీరథ పథకం గ్రిడ్ విభాగం ఏఈ అనిల్‌ను వివరణ కోరగా.. రాజారాంతండా దూరంగా ఉందని, ఆ గ్రామానికి మిషన్ భగీరథ పథకం నీళ్ల వచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు.

చెప్పినా పట్టించుకుంటలేరు



మా గ్రామానికి మిషన్ భగీరథ పథకం నీళ్ల రావడం లేదని ప్రజాప్రతినిధులు, అధికారులకు చెప్పినం. అయినా సమస్య తీరలేదు. గ్రామస్తులం వాడల్లోని బోరు బావుల ద్వారా నీటి అవసరాలు తీర్చుకుంటున్నం. ఎండాకాలంలో నీళ్ల సమస్య తీవ్రంగా ఉంది. నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి. మిషన్ భగీరథ పథకం నీళ్ల మా గ్రామానికి అందించాలి.

– లకావత్ శ్రీనివాస్, రాజారాంతండా

కొన్ని రోజులే వచ్చాయి



మా గ్రామానికి మిషన్ భగీరథ పథకం నీళ్ల రావడం లేదని అధికారులకు పలుమార్లు చెప్పినం. వాళ్లచ్చి ట్యాంకు, పైపులైన్లను పరిశీలించి వెళ్లారు. కొన్ని రోజులు నీళ్ల వచ్చి ఆ తర్వాత రాలె. వేసవిలో బోరు బావులు ఎండి నీటి సమస్య తీవ్రమైంది. ట్యాంకులోకి మిషన్ భగీరథ నీళ్ల వస్తే సమస్య తీరుతుంది. ఇదే విషయాన్ని అధికారులకు చెప్పినా పరిష్కారం చూపడం లేదు.

– లవుడ్యా సరిత, మాజీ సర్పంచ్, రాజారాంతండా

బీజేపీలో చేరికలు



బీజేపీలో చేరిన నాయకులతో ఎంపీ అర్వింద్

జగిత్యాలటౌన్: స్థానిక పోచమ్మవాడకు చెందిన కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన పలువురు గురువారం నిజామాబాద్‌లో ఎంపీ అర్వింద్ సమక్షంలో బీజేపీలో చేరగా.. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణరావు, పట్టణ అధ్యక్షుడు రంగు గోపాల్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కొక్కు గంగాధర్, నాయకులు భోగ ప్రవీణ్, కాశెట్టి తిరుపతి, ఆకుబత్తిని మనోజ్ తదితరులున్నారు.

పెళ్లి సామగ్రి వితరణ



సామగ్రి అందిస్తున్న ట్రస్టు సభ్యులు

కోరుట్ల: మదర్ లవ్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో పట్టణానికి చెందిన ఓ పేదింటి ఆడపిల్ల పెళ్లికి గురువారం సామగ్రి అందించారు. సుమారు రూ.25వేల సామగ్రిని అందించారు. పోతుగంటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు

కథలాపూర్: తక్కళ్లపెల్లి గ్రామానికి చెందిన బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరగా.. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ గురువారం వారికి పార్టీ కండువాలు కప్పారు. గ్రామానికి చెందిన అల్లకొండ విజయ్, బద్దం లక్ష్మారెడ్డి, బక్కన్న, సాయాబ్, జీవన్, ప్రసాద్, నవీన్, ప్రసాద్, విజయ కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కాయితి నాగరాజు, నాయకులు లింగంగౌడ్, అజీమ్, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న భక్తులు

ఘనంగా సీతారాముల పట్టాభిషేక మహోత్సవం

మెట్‌పల్లి: పట్టణంలోని కోదండ రామాలయంలో గురువారం సీతారాముల పట్టాభిషేక మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ముందుగా పురోహితుడు రమాకాంత్‌చారి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపి తర్వాత పట్టాభిషేకం చేశారు. తిలకించడానికి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు మహాజన్ నర్సింహులు, ఎస్సారెస్పీ ఈఈ వెంకటేశ్వర్లు, శ్రీనివాసాచారి, ఆర్మూర్ పోచయ్య, పర్మి నర్సయ్య తదితరులున్నారు.

ప్రత్యేకాధికారులు అందుబాటులో ఉంటలేరు

- మండల సర్వసభ్య సమావేశంలో ప్రశ్నించిన డబ్బా ఎంపీటీసీ



సర్వసభ్య సమావేశంలో ప్రశ్నిస్తున్న డబ్బా ఎంపీటీసీ దెశెట్టి శాంత

ఇబ్రహీంపట్నం: గ్రామ ప్రత్యేకాధికారులు గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో అందుబాటులో ఉండడం లేదని డబ్బా ఎంపీటీసీ దెశెట్టి శాంత అధికారులకు తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ జాజాల భీమేశ్వరి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. గ్రామాల్లో ఏమైనా సమస్యలుంటే తెలపాలని ఎంపీపీ కోరారు. డబ్బా ఎంపీటీసీ శాంత మాట్లాడుతూ.. సర్పంచుల పదవీకాలం పూర్తి కాగానే ప్రత్యేకాధికారులను నియమించారని, ఈ అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండక పంచాయతీల పరిధిలో పారిశుధ్యం లోపిస్తోందని అన్నారు. డబ్బా గ్రామ ప్రత్యేకాధికారి డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. వారానికి 4 రోజులు పంచాయతీ కార్యాలయానికి వస్తున్నానని, సమస్యలుంటే దృష్టికి తీసుకురావాలని సమాధానమిచ్చారు. యామపూర్ ఎంపీటీసీ బొరిగం వివేకవర్ధిని మాట్లాడుతూ.. ప్రజాపాలనలో సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌కు దరఖాస్తు చేసుకున్న చాలామంది మండల పరిషత్ కార్యాలయం చుట్టు తిరుగుతున్నారన్నారు. యామపూర్ వెంకటాద్రి చెరువు తూమ్ షెటర్ చెడిపోయిందని, వెంటనే మరమ్మతులు చేయించి నీరు నిలువ ఉండేలా అధికారులు చర్యలు చేపట్టాలని, గంగనాల ప్రాజెక్టుకు నిరంతరం నీరు వచ్చేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఎంపీడీవో రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రజాపాలన దరఖాస్తుల సవరణకు ఎన్నికలు పూర్తి కాగానే ఆన్‌లైన్‌లో ఆప్షన్ వస్తుందని, అప్పుడు సవరణలు చేయడం జరుగుతుందన్నారు. ఎంపీపీ మాట్లాడుతూ.. మండలంలో ఎక్కడ కూడా తాగునీటి ఎద్దడి లేకుండా అధికారులు నిరంతరం పరిశీలించాలని సూచించారు. వైస్ ఎంపీపీ నోముల లక్ష్మారెడ్డి, ఇన్‌చార్జి ఎంఈవో ఆనందరావు, ఏఈలు అరుణ, సతీష్, ఏఈవో శ్యామ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రతిభ, మండల కోఆప్షన్ సభ్యుడు ఎలేటి చిన్నారెడ్డి, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

అవిశ్వాసం ఉన్నట్లా.. లేనట్లా?

డిసెంబర్ 27న 9 మంది ఎంపీటీసీలు ఎంపీపీపై అవిశ్వాసం పెట్టాలని ఆర్డీవోకు విన్నవించి క్యాంపునకు వెళ్లిపోయారు. కొద్ది రోజుల తర్వాత ఎంపీపీ అవిశ్వాసం పెట్టకుండా ఉండేందుకు హైకోర్టు నుంచి స్టే తీసుకురావడంతో.. అవిశ్వాస తీర్మానం పెట్టలేదు. స్టే కొనసాగుతుండగా.. అవిశ్వాసం పెట్టే ఎంపీటీసీల్లో బొరిగం వివేకవర్ధిని, బాశెట్టి రాధ, మాలవాత్ సరోజన, దెశెట్టి శాంత, బొరిగం రాజుబాయ్ సమావేశానికి హాజరయ్యారు. దీంతో సమావేశం సజావుగా సాగింది.

సంఘాలు-కార్యవర్గాలు

మల్యాల ఇన్‌చార్జి ఎంపీపీగా రవి



ఇన్‌చార్జి ఎంపీపీగా బాధ్యతలు స్వీకరించిన రవి

మల్యాల: మండల పరిషత్ వైస్ ఎంపీపీ పోతాని రవిని మల్యాల మండల పరిషత్ ఇన్‌చార్జి ఎంపీపీగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో.. గురువారం ఇన్‌చార్జి ఎంపీపీగా బాధ్యతలు చేపట్టారు. మల్యాల ఎంపీపీ మిట్టపల్లి విమల సుదర్శన్‌పై ఈనెల 2న అవిశ్వాసం నెగ్గడంతో.. ఈనెల 8న ఎంపీపీని తొలగించినట్లు ఎంపీడీవో స్వాతి తెలిపారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు వైస్ ఎంపీపీ రవిని ఇన్‌చార్జి ఎంపీపీగా నియమించినట్లు చెప్పారు. రవికి ఎంపీటీసీలు, అధికారులు శుభాకాంక్షలు తెలిపారు.

బీజేపీ కార్యవర్గం ఎన్నిక



నియామక పత్రం అందజేస్తున్న వేణు

రాయికల్: బీజేపీ మైతాపూర్ గ్రామ అధ్యక్షుడిగా మోత్కూరి శ్రీనివాస్‌గౌడ్, యువ మోర్చా అధ్యక్షుడిగా పడిగెల హరీశ్, ప్రధాన కార్యదర్శిగా నాగిరెడ్డి సంతోష్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా వేల్పుల మహేశ్, కోశాధికారిగా గంగుల భూమేశ్, కార్యదర్శులుగా రాజిరెడ్డి, పరమేశ్, గౌరవ అధ్యక్షులుగా మహిపాల్‌రెడ్డి, దుంపల రజిత, గౌరవ సలహాదారుగా జగదీశ్వర్‌ను నియమించినట్లు మండల అధ్యక్షుడు అన్నవేని వేణు తెలిపారు.

బీజేపీ పట్టణ అధ్యక్షుడిగా అశ్విన్



మల్లాపూర్: బీజేపీ పట్టణ అధ్యక్షుడిగా సోమ అశ్విన్, మండల ఉపాధ్యక్షుడిగా గడ్డం నర్సారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా సరికెల నర్సయ్యను నియామకం చేసినట్లు మండల అధ్యక్షుడు గోపిడి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. బీజేపీ మండల శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నియామక పత్రాలను అందించారు. జిల్లా కార్యదర్శి ఎర్ర లక్ష్మీ, మండల ఉపాధ్యక్షుడు లవంగ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ సంఘం మండల ఉపాధ్యక్షుడిగా నాగరాజు



రాయికల్: బీసీ సంఘం మండల ఉపాధ్యక్షుడిగా కుమ్మరిపల్లి గ్రామానికి చెందిన తునికి నాగరాజును నియమించినట్లు మండల అధ్యక్షుడు బండారి సాయిరాజ్‌గౌడ్ గురువారం తెలిపారు. సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

కొనుగోలు కేంద్రాలు పరిశీలించిన డీఆర్డీవో



భూషణరావుపేటలో తూకం పరిశీలిస్తున్న డీఆర్డీవో సంపత్‌రావు

కథలాపూర్: చింతకుంట, భూషణరావుపేట, కథలాపూర్ గ్రామాల్లోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను డీఆర్డీవో సంపత్‌రావు గురువారం పరిశీలించారు. తేమ శాతం పరీక్షించాకే నిబంధనల మేరకు త్వరగా తూకం వేయాలని సిబ్బందికి సూచించారు. కొనుగోలు కేంద్రాల్లోని రికార్డులను పరిశీలించి సిబ్బందికి సూచనలిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శంకర్, ఏపీఎం నరహరి, సీసీలు అంజయ్య, అశోక్, విజయనిర్మల పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించాలి



కుమ్మరిపల్లిలో రైతులతో మాట్లాడుతున్న ఏఈవో మతాయి

రాయికల్: కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించాలని ఏఈవో మతాయి అన్నారు. గురువారం కుమ్మరిపల్లి, శివాజీనగర్, రాయికల్ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఏ గ్రేడ్ రకానికి రూ.2,203, సాధారణ రకానికి రూ.2,183 ప్రభుత్వం ప్రకటించిందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీఈవో తిరుపతి, ఇన్‌చార్జి దేవనందం, నల్ల పవన్, గోపాల్, నర్సారెడ్డి, కొడిమ్యాల భూమన్న తదితరులు పాల్గొన్నారు.

మొక్కల రక్షణకు చలువ పందిళ్లు

- నర్సరీల్లో మొక్కల రక్షణకు ప్రత్యేక చర్యలు
- గ్రామానికి 10వేల చొప్పన మొక్కల పెంపకం లక్ష్యం



పెగడపల్లి నర్సరీలో షెడ్‌నెట్ నీడలో పెరుగుతున్న మొక్కలు

పెగడపల్లి: వేసవి కాలం ఎండలు ముదురుతున్న దృష్ట్యా నర్సరీల్లో పెంచుతున్న హరితహారం మొక్కలను కాపాడేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగానే హరితహారం మొక్కల సంరక్షణకు గానూ చలువ పందిళ్ల(షెడ్‌నెట్లు) వేశారు. నర్సరీల్లో పెంచుతున్న మొక్కలను కాపాడేందుకు ఉపాధిహామీ సిబ్బంది ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు.

చలువ పందిళ్ల ఏర్పాటు

హరితహారంలో భాగంగా పెగడపల్లి మండలంలో 23 గ్రామాల్లో ఉపాధిహామీ పథకం ద్వారా వన నర్సరీలు ఏర్పాటు చేసి గ్రామానికి 10 వేల మొక్కల చొప్పున నాటాలని లక్ష్యంగా నిర్ణయించి మొత్తంగా సుమారు 2.30 లక్షల మొక్కలను పెంచుతున్నారు. అయితే పెంచుతున్న మొక్కలు వేసవిలో ఎండిపోకుండా నర్సరీ చుట్టూ ప్రత్యేకంగా స్తంభాలను ఏర్పాటు చేసి చలువ పందిళ్ల వేశారు. సాయంత్రం 5 గంటల వరకు ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో ఉదయం 9 గంటల లోపే సిబ్బంది మొక్కలకు నీళ్ల పడుతున్నారు.

కూలీలకు ఉపాధి..

ఉపాధిహామీ పథకంలో భాగంగా మండలంలో ఏర్పాటు చేసిన నర్సరీల్లో సుమారు నాలుగు వందల మంది కూలీలు ఉపాధి పొందుతున్నారు. కూలీలు మొక్కలను పెంచడం, నీళ్ల పోయడం లాంటి పనులు చేస్తున్నారు. అదేవిధంగా మొక్కలు ఎండిపోకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వం నర్సరీలను ఏర్పాటు చేయడంతో ఉపాధిహామీ పథకంలో కూలీల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. ప్రభుత్వ లక్ష్యాన్ని చేరుకునేందుకు ఉపాధి కూలీలు ఎండల్లో కూడా పని చేస్తున్నారు. నర్సరీల నిర్వహణ బాధ్యతలను గ్రామ పంచాయతీల పరిధిలో ప్రత్యేక అధికారుల పర్యవేక్షణలో పంచాయతీ కార్యదర్శులకు అప్పగించింది. ప్రతి వన నర్సరీలో నీటి సదుపాయం ఏర్పాటు చేసేందుకు బోరు బావి వేశారు. దీంతో రోజు పెంచుతున్న మొక్కలను ఉపాధిహామీ కూలీలచే నీటిని పట్టించి మొక్కలు ఎండిపోకుండా చూడాల్సి ఉంది. నర్సరీల నిర్వహణపై నిత్యం జిల్లాస్థాయి అధికారులతోపాటు ఎంపీడీవో, ఏంపీవోలు, ఈజీఎస్ అధికారులు పర్యవేక్షిస్తున్నారు. వర్షాలు కురిస్తే జూన్ రెండో వారం వరకు హరితహారంలో మొక్కలు నాటే కార్యక్రమం ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు. నర్సరీల నిర్వహణకు ఎలాంటి లోపాలు లేకుండా చూస్తున్నారు.

ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం



నర్సరీల్లో పెంచుతున్న మొక్కలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. వేసవిలో ఎండ వేడిమికి మొక్కలు చనిపోకుండా పెంచిన ప్రతి మొక్కను కాపాడాలనే ఉద్దేశ్యంతో చలువ పందిళ్లను ఏర్పాటు చేశాం. మొక్కలను వృక్షాలుగా పెంచాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది. అందులో భాగంగానే మొక్కల సంరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుంది.

– శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీవో, పెగడపల్లి

ఒలంపియాడ్ పరీక్షలో ప్రతిభ



జగిత్యాల: జిల్లాకేంద్రంలోని జ్యోతి హైస్కూల్‌కు చెందిన ఐఐటీ అకాడమీ విద్యార్థులు గత నెల నిర్వహించిన గైడియల్ ఒలంపియాడ్ పరీక్షలో ప్రతిభ కనబర్చి ర్యాంకులు సాధించారు. సుప్రియ 1వ ర్యాంక్, కీర్తన 4, అనిరుద్ 9వ ర్యాంక్ సాధించారు. పాఠశాల డైరెక్టర్ హరిచరణ్‌రావు అభినందించారు.

దరఖాస్తుల ఆహ్వానం

కోరుట్ల: పట్టణ శివారులోని పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశ పరీక్షకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ రామాప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంజనీరింగ్ సివిల్, మెకానికల్ డిప్లొమాలో ప్రవేశ పరీక్ష రాసేందుకు 10వతరగతి విద్యార్థులు ఈనెల 22 లోగా దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు.